క్లుప్తంగా

స్నేహితురాలికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న మిత్రులు

చిలుకూరు : మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో శ్రీకాంత్ భార్య మానసతో పాటు చిలుకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007– 2008 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న తోటి స్నేహితులు లక్షా 16 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని బుధవారం ఆమెకు అందజేసి అండగా నిలిచారు. ఈ కార్యక్రమంలో జ్యోతి, అనూష, కృష్ణవేణి, సింధూ, సుజాత, బేబి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన రవిచంద్రకు శుభాకాంక్షలు



రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు

కోదాడఅర్బన్ : వద్దిరాజు రవిచంద్ర రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఎన్నిక కావడం పట్ల తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆవుల రామారావు, సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని వద్దిరాజు గృహంలో ఆయనను కలిసి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మున్నూరు కాపు సంఘం ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ తదితరులు ఉన్నారు.

కల్లు గీత కార్పొరేషన్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

చిలుకూరు : మండలంలోని జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు భయ్యా రాములు బుధవారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి కింద పడి మృతి చెందాడు. దీంతో కల్లు గీత కార్మిక సంఘం నుంచి రాములు దిన ఖర్చులకు తక్షణ ఆర్థికసాయంగా మంజూరైన రూ.25 వేల చెక్కును ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మృతుడి భార్య రమణకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ వట్టికూటి నాగయ్య, బెల్లంకొండ నాగయ్య, పారేపల్లి నాగేశ్వరరావు, భయ్యా హుస్సేన్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.


శోభన్‌బాబుకు సన్మానం



శోభన్‌బాబును సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో యువత కష్టపడి కాకుండా ఇష్టంతో చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కస్తాల వెంకటేశ్వర్లు సూచించారు. గురుకుల కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఫలితాల్లో రాష్ట్రంలో రెండవ ర్యాంకు సాధించి ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపికైన మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన దళిత యువకుడు జిల్లేపల్లి శోభన్‌బాబును బుధవారం శాలువాతో సత్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన జిల్లేపల్లి శోభన్‌బాబును నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో శోభన్‌బాబు, తల్లిదండ్రులు వెంకటయ్య, లక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు మృతి



నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నాయకులు

మఠంపల్లి : మఠంపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు భూక్యా బాలునాయక్ (56) బుధవారం అనారోగ్యంతో మృతిచెందాడు. బాలునాయక్ మృతదేహంపై సీపీఎం నాయకులు ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. సీపీఎం సీనియర్ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, సయ్యద్ రన్మియా, రాము, రవి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో దూడ మృతి

చిలుకూరు : కుక్కల దాడిలో దూడ మృతి చెందిన సంఘటన చిలుకూరు గ్రామంలో బుధవారం జరిగింది. చిలుకూరు గ్రామానికి చెందిన రైతు కొండా రాంబాబుకు చెందిన దూడ ఇంట్లో ఉండగా పదికి పైగా కుక్కలు ఇంట్లోకి వచ్చి కరవడంతో దూడ మృతి చెందినట్లు రైతు తెలిపారు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువైందని, తక్షణమే కుక్కలను పట్టి గ్రామానికి దూరంగా తరలించాలని రైతు డిమాండ్ చేశారు.

గురుకులంలో నీటి కష్టాలు

- అడుగంటిన పాఠశాలలోని బోరు
- తాగునీటితో పాటు నిత్యావసరాలకు సరిపడా నీరు లేక తిప్పలు
- స్నానం, బట్టలు ఉతుక్కోవడానికి సమీప పొలాల్లోని బోర్లను ఆశ్రయిస్తున్న విద్యార్థులు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలో ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల బాలుర విద్యాలయంలో నీటి సమస్య ఏర్పడింది. విద్యార్థులకు తాగు నీటితో పాటు నిత్యావసరాలకు కూడా నీరు రాక ఇబ్బందులు పడుతున్నారు. స్నానాలకు, బట్టలు ఉత్తుకోవడానికి సమీప పొలాల్లోని మోటార్ల వద్దకు వెళ్తూ అవస్థలు పడుతున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో..

కాగా, గత మూడు సంవత్సరాల క్రితం హుజూర్‌నగర్ నియోజకవర్గానికి మంజూరైన గిరిజన గురుకుల బాలుర పాఠశాలను మేళ్లచెరువు మండల కేంద్రం శివారులోని ఓ ప్రైవేటు భవనాన్ని అద్దెకు తీసుకొని ఏర్పాటు చేశారు. ప్రస్తుత సంవత్సరం ఇందులో ఐదవ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉంది. పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల కూడా ఉండడంతో ఇక్కడ సుమారు 350 నుంచి 400 మంది వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాలలో నీటిని అందించేందుకు ఒక



పంట పొలాల్లోని మోటారు వద్ద స్నానం చేస్తున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

తాగు నీటి బోరు ఉన్నది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు పడిపోవడంతో బోరులో నీరు రోజువారీ అవసరాలు తీర్చుకోవడానికి కూడా రావడం లేదు. అయినా భవన యాజమాన్యం, పాఠశాల అధికారులు నీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులు సమీపంలోని పంట పొలాల్లో ఉన్న సాగు నీటి బోర్లను ఆశ్రయించి అక్కడే బట్టలు ఉతుక్కోవడంతో పాటు స్నానాలు చేస్తున్నారు. అనేక మంది విద్యార్థులు ఒకేసారి పొలాల వద్దకు వస్తుండడంతో తమ పంట ఆగం చేస్తారని రైతులు వారిని ఒక్కోసారి అక్కడకు రాకుండా అడ్డుకుంటున్నట్లు తెలిసింది. దీంతో విద్యార్థులు బట్టలు ఉతుక్కోవడం, స్నానాలు చేయడం వంటివి రెండు రోజులకోసారి చేయాల్సి వస్తుందని చెబుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మా పాఠశాలలో నీరు లేక ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలలో సరిపడా నీరు లేకపోవడంతో పాఠశాలకు దగ్గరలో ఉన్న బంధువుల ఇళ్లకు వెళ్లి స్నానం చేసి, బట్టలు ఉతుక్కొని వస్తున్నాం. గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. అధికారులు చొరవ చూపి నీటి సమస్యను పరిష్కరించాలి.

– తనుష్, విద్యార్థి

బురద నీరు వస్తుందని విద్యార్థుల ఆవేదన

బోరు అడుగంటడంతో తాగునీరు కూడా బురదగా వస్తుందని ఆ నీటిని తాగలేకపోతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల సమీపంలోని కోదాడ– మేళ్లచెరువు మెయిన్ రోడ్డు ఉండడంతో విద్యార్థులు రోడ్డు దాటి అవతల ఉన్న పొలాల్లోని బోర్ల వద్ద వచ్చి నీటిని వాడుకుంటున్నారు. దీంతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు దాటేటప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా పొలాల్లోకి వెళ్లినప్పుడు విష పురుగులు కుట్టే ప్రమాదం ఉంది. కావునా గురుకుల పాఠశాలలో నీటి కష్టాలు తీర్చేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలి

మునగాల : మునగాల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గణపవరం రహదారి వెంట ఏర్పాటు చేసిన అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొప్పుల జైపాల్ రెడ్డి, ఉప్పుల జానకిరెడ్డి, కాసర్ల కోటేశ్వరరావు, సీపీఎం నాయకుడు దేవరం వెంకటరెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మునగాల తహసీల్దార్‌కు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణపవరం రహదారి వెంట సర్వే నంబర్ 496/3, 4లలోని సుమారు 8 ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా రియల్ ఎస్టేటు వ్యాపారులు ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. నాలా చట్టం కింద అనుమతి లేకుండా (వ్యవసాయ భూమిని) వ్యవసాయేతర భూమిగా మార్చకుండా తప్పుడు పద్ధతుల్లో ప్లాట్లుగా విక్రయిస్తున్నారని



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్, సీపీఎం నాయకులు

ఆరోపించారు. కనీసం గ్రామపంచాయతీ అనుమతి, లేఅవుట్ల అనుమతి లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారుల దందా యథేచ్ఛగా కొనసాగుతుందని తెలిపారు. ఈ అక్రమ వెంచర్‌పై గ్రామపంచాయతీ పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు.

హరేరామ నామ సంకీర్తన ప్రారంభం

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయంలో 64వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో 72 గంటల పాటు (మూడు రోజులు రేయింబవళ్లు) కొనసాగే అఖండ హరేరామనామ సంకీర్తన బుధవారం ప్రారంభమైంది. తొలుత ఆలయ కమిటీ చైర్మన్ తూముల వీరస్వామి హనుమాన్ పతాకావిష్కరణ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, హనుమాన్ మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.



హనుమాన్ పతాకం ఆవిష్కరిస్తున్న ఆలయ చైర్మన్ వీరస్వామి

మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలి



మాతృభాషపై నిర్వహించిన పోటీలో స్పష్టమైన తెలుగులో మాట్లాడుతున్న విద్యార్థిని

కోదాడఅర్బన్ : మాతృభాష పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలని తేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ సీఈఓ ఎస్ఎస్‌రావు కోరారు. బుధవారం కోదాడలోని తేజ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌రావు మాట్లాడుతూ తెలుగు భాష తేనెలొలికే తీయనైన భాష అని, ప్రతిఒక్కరూ అన్యభాషలు నేర్చుకున్నప్పటికీ మాతృభాషను మరిచిపోవద్దన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై పూర్తిగా తెలుగులో మాట్లాడిన ఐదుగురు విద్యార్థినులు బి.మౌనిక, ఎస్.శాలిని, కె.మనీషా, మమత, దీపక్‌ను ఆయన అభినందించి బహుమతులు అందజేశారు.

జర్నలిస్టు కృష్ణయ్యకు నివాళి

నేరేడుచర్ల : రెండు దశాబ్దాలు పత్రిక రంగంలో రాణించిన సీనియర్ జర్నలిస్టు పి.కృష్ణయ్య అకాల మృతి జర్నలిస్టులకు తీరని లోటని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలసాని శ్రీనివాస్‌రావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కోల నాగేశ్వరరావు, డాక్టర్ బంటు కృష్ణ, గ్రామీణ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నేత దొంతిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, టీఎస్‌స్వామి అన్నారు. బుధవారం నేరేడుచర్ల మండలంలోని పెంచికల్‌దిన్న గ్రామంలో పి.కృష్ణయ్య మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జర్నలిస్టు కృష్ణయ్య కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని అన్నారు. సంతాపం తెలిపిన వారిలో జర్నలిస్టులు గుండా గోపాలకృష్ణ, రాజు, నాగుల్‌మీరా, చామకూరి వీరయ్య, బొళ్ల సుధాకర్, కొంపెల్లి కృష్ణారావు, వనపర్తి శ్రీనివాస్, రాగిరెడ్డి



జర్నలిస్టు కృష్ణయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జర్నలిస్టు నాయకులు

నర్సిరెడ్డి, ప్రభాకర్‌రావు, దొంతిరెడ్డి వెంకటరమణారెడ్డి, బీజేపీ జిల్లా నాయకురాలు చల్లా శ్రీలతారెడ్డి, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, మాజీ సర్పంచ్ కొణతం సత్యనారాయణరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పూర్ణచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

పీసీసీ మాజీ సభ్యురాలు మేరమ్మ మృతి



గొబ్బి మేరమ్మ (ఫైల్)

నడిగూడెం : మండలంలోని చెన్నకేశ్వాపురంనకు చెందిన మాజీ పీసీసీ సభ్యురాలు గొబ్బి మేరమ్మ (65) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. మేరమ్మ గతంలో కాగితరామచంద్రాపురం ఎంపీటీసీ సభ్యురాలిగా, ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శిగా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పని చేశారు. ఆమె మృతహానికి కాంగ్రెస్ పార్టీ, పలు సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బూత్కూరి వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు శ్రీను, ప్రధాన కార్యదర్శి వేపూరి సుధీర్, సింగిల్ విండో చైర్మన్ గోసుల రాజేష్, విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు ఎండి.ఖలీల్, కాంగ్రెస్ నాయకులు తుమ్మల సుబ్బారావు, గుజ్జర్లపూడి అర్జునరావు, పగడాల ప్రభాకర్‌రెడ్డి, గడ్డం మల్లేష్, తదితరులు ఉన్నారు.

పీఎం విశ్వకర్మ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మోతె : పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని విశ్వకర్మ సంఘం మోతె మండల అధ్యక్షుడు ఓరోజు నాగాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుల వృత్తుల వారు మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వమే ఉచితంగా శిక్షణ ఇచ్చి రుణ సౌకర్యం కల్పిస్తుందని పేర్కొన్నారు. వివరాలకు పంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలని తెలిపారు.

టీయూడబ్ల్యూజే మండల కమిటీ ఎన్నిక

మునగాల : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) మండల కమిటీని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని తుంగతుర్తిలో గల ఓ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా తుమ్మల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా దామెర రవిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన వారికి టీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు జీఎస్‌రెడ్డి, జె.సామ్యూల్, షేక్ దస్తగిరి అభినందనలు తెలిపారు.

ఆలయ చైర్మన్, ఈఓపై చర్యలు తీసుకోవాలని వినతి

మునగాల : ఎండోమెంట్ పరిధిలో ఉన్న మండలంలోని బరాఖత్‌గూడెంలో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ముద్రించిన కరపత్రంలో ప్రోటోకాల్ పాటించకుండా అనర్హత వేటు పడిన జెడ్పీటీసీ సభ్యురాలు పదవిలో ఉన్నట్లు ప్రచురించిన ఆలయ కమిటీ చైర్మన్, ఈఓపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త రాయిరాల సుమన్ కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు, పోలీసు అధికారులకు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై దేవాలయ ఈఓకు ఫోన్ చేస్తే స్పందించడం లేదని తెలిపారు. కాగా తన ఫిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్ జెడ్పీ సీఈఓకు విచారణ జరపాలని ఆదేశాలు ఇచ్చారని వివరించారు.

వైభవంగా జలాధివాసము



హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు

చిలుకూరు : మండలంలోని కొమ్ముబండతండాలో శ్రీ శీతల పరమేశ్వరి (బొడ్రాయి) ప్రతిష్ఠ సందర్భంగా రెండో రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా 1008 జల బిందెలతో జలాధివాసము, ప్రత్యేక అభిషేకాలు, హోమం, విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. గురువారం ఉదయం బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవం ఉన్నట్లు నిర్వాహకులు, గ్రామస్తులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజావైద్యశాల ఏర్పాటుకు భూమి కేటాయించాలి

హుజూర్‌నగర్ : ప్రజా వైద్యశాల ఏర్పాటుకు భూమిని కేటాయించాలని పలువురు కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈమేరకు బుధవారం హుజూర్‌నగర్‌లో ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మఠంపల్లి మండలంలోని సిమెంట్ పరిశ్రమల సహకారంతో ప్రజావైద్యశాల ఏర్పాటు చేసేందుకు మఠంపల్లి, పెదవీడు గ్రామాల రెవెన్యూ పరిధిలో సుమారు 5 ఎకరాల భూమిని సేకరించాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాముల శివారెడ్డి, గంగసాని ఎల్లారెడ్డి, కరీం, కిషోర్, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్, రవి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు బుధవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిమోగ్లోబిన్ రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు నాగేందర్, మంగ, ప్రధానాచార్యులు భీమార్జునరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీఓలు డాక్టర్ నగేష్, శ్రీనివాసరావు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల మరణాలపై విచారణ జరిపించాలి

మోతె : రాష్ట్రంలో గురుకుల విద్యార్థినుల వరుస మరణాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోతె మండలంలోని బుర్కచర్ల గ్రామంలో నాలుగు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న ఇమాంపేట ఎస్సీ గురుకుల పాఠశాల పదవ తరగతి విద్యార్థి ఇరుగు అస్మిత కుటుంబ సభ్యులను బుధవారం ఆయన పరామర్శించారు. ఆ సందర్భంగా సైదులు మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యార్థినుల మరణాలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆత్మహత్యలకు పాల్పడ్డ విద్యార్థినుల కుటుంబాలకు కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు కొక్కొరేణి సత్యనారాయణ, కొండ రాములు, నాగమల్లయ్య, మహిళ సంఘం నాయకురాలు మట్టిపల్లి నీలిమా తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదుకు గడువు పెంపు

హుజూర్‌నగర్ : పట్టభద్రుల ఓటు నమోదుకు ఎన్నికల సంఘం మార్చి 14 వరకు గడువు పెంచిందని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఎమ్మెల్సీ ఎన్నికలకు అర్హులైన పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 1– 11 –2020 నాటికి పట్టభద్రులైన వారు స్థిర నివాసం ఉన్నచోటనే దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సమావేశంలో డీఏఓ నారాయణ, తహసీల్దార్ నాగార్జునరెడ్డి, ఎన్నికల డీటీ కమలాకర్,



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే విజయం సాధ్యం

- డీఐఈఓ కృష్ణయ్య

నడిగూడెం : కష్టపడి చదివితే విజయం సాధ్యమని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జానపాటి కృష్ణయ్య కోరారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. దాతల సహకారంలో నడిగూడెంలో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల, అందులో వసతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచి పేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం దాతల సహకారంతో నిర్మించిన



మాట్లాడుతున్న డీఐఈఓ కృష్ణయ్య

అదనపు తరగతి గదులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మన్నెం సోమయ్య, దాతలు నాగేందర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, అభివృద్ధి కమిటీ సభ్యులు ఎండి.అఫ్జల్, బుస్సా మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో మెప్మా విభాగంలో పనిచేస్తున్న ఆర్పీల పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని మంజూరు చేయాలని కోరుతూ బుధవారం మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరితలకు ఆర్పీలు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ మెప్మా ఆర్పీలకు 2023 జూన్ నుంచి సెప్టెంబర్ వరకు రూ.4 వేల చొప్పున, 2023 అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు రూ.6 వేల చొప్పున వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆర్పీలకు వేతనాలను రూ. 20 వేలకు పెంచాలని కోరారు. ప్రభుత్వం బడ్జెట్‌లో ఆర్పీలకు ప్రత్యేక నిధులు కేటాయించి ప్రతినెల గౌరవ వేతనాలు అందించాలన్నారు. ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.



చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్పీలు

వినతి పత్రాన్ని అందజేసిన వారిలో నేరేడుచర్ల మెప్మా విభాగం ఆర్పీల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు యలవర్తి కళ్యాణి, తంగేళ్లపల్లి నాగలక్ష్మి, కోశాధికారి గుంటి రమ్య తదితరులు ఉన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



హుజూర్‌నగర్ : స్వామివారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న పూజారులు, అధికారులు



మఠంపల్లి : చౌటపల్లిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీవేణుగోపాల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. బుధవారం అధ్యయనోత్సవాలలో భాగంగా ఆళ్వారుల సేవ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో వేకువజామున సుప్రభాత సేవ, తిరుప్పావై సేవాకాలం జరిపించారు. శ్రీసీతారామచంద్రస్వామి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో అలంకరించి, ఆళ్వార్లను తులసి మాలలతో అలంకరించి భద్ర పీఠంపై చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆళ్వారుల పల్లకీ సేవలో వివిధ వేదాలను పఠిస్తూ, మంగళ వాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పూజారులు, అధికారులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

చౌటపల్లిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో..

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలను బుధవారం రాత్రి ప్రత్యేక పూజలతో అర్చకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, అష్టోత్తర కలషాభిషేకం, అలంకారం సుదర్శన హోమం, బలిహరణ, నిత్యహోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ సింగారపు సైదులు, ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణ్‌రావులు మాట్లాడుతూ ఈనెల 25వరకు బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, దానిలో భాగంగా 24న రాత్రి శ్రీస్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరారెడ్డి, సైదులు, మల్లీశ్వరి, శివయ్య, అర్చకులు నరగిరినాథుని రామక్రిష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్ సహకారంతో రోడ్ల నిర్మాణం

గరిడేపల్లి : మండలంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. సీసీ రోడ్డు నిర్మాణానికి స్థలం అందించిన దాతలు గంటా సుధాకర్‌రెడ్డి, రైతు సేవా సహకార సంఘం చైర్మన్ గంట పిచ్చిరెడ్డి, గంటా వాసుదేవరెడ్డిలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కటకం ఆశారమేష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆరెపూడి నారాయణ, మాజీ జెడ్పీటీసీ పిన్నాని



గడ్డిపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ పెండెం సుజాత

కోటేశ్వర్‌రావు, గోపాల్‌దాసు సతీష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అల్పాహారం అందజేత



అల్పహారం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ యడవెల్లి సత్యనారాయణరెడ్డి, నేరేడుచర్ల క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌దిన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు దాతలు రాచకొండ శబరీనాథ్, పోలగాని సీతారాములు ఏర్పాటు చేసిన అల్పాహారం అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి జిలకర రామస్వామి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, రాఘవారెడ్డి, యాదయ్య, క్లబ్ సభ్యుడు రంగారెడ్డి ఉన్నారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడరూరల్ : ఏపీ నుంచి అక్రమంగా కోదాడకు వస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టణ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఏపీలోని నందిగామ సమీపంలోని ఇసుక రీచ్ నుంచి ఇసుక లోడ్ చేసుకొని ఎలాంటి అనుమతులు లేకుండా కోదాడలోకి వస్తుండగా మేళ్లచెర్వు బైపాస్ వద్ద పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. టిప్పర్ సీజ్ చేసి డ్రైవర్‌తో పాటు ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మునగాల : మునగాల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కొనసాగుతున్నందున సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మండల ట్రాన్స్‌కో ఏఈ వికాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

3న 'పల్స్ పోలియో'

నడిగూడెం : మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న కోరారు. బుధవారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మార్చి 4, 5 తేదీల్లో ఇంటింటికి వెళ్లి పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది సహకరించాలన్నారు. ఈ సమావేశంలో మండల తహసీల్దార్ హేమామాలిని, ఎంపీడీఓ ఎస్‌డి.ఇమామ్, స్థానిక పల్లె దవాఖానా వైద్యాధికారి డాక్టర్.హరినాథ్, ఆరోగ్య విస్తరణాధికారి సురేందర్, హెల్త్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.